క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావుపేట సెక్షన్, చుట్టుగుంట సబ్ స్టేషన్ 11 కేవీ విశాలాంధ్ర ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ టౌన్ ఈఈ బీవీ సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. చుట్టుగుంట సబ్ స్టేషన్ ఏరియా, విశాలాంధ్ర ప్రెస్ ఏరియా, బ్రహ్మానందరెడ్డి నగర్ అన్ని లైన్లు , దాసరి వారి వీధి, కోవెలమూడి వారి వీధి, చలసాని వెంకటకృష్ణయ్య వీధి, వేముల శ్యామలాదేవి రోడ్, బాలాజీ స్ట్రీట్, పాపయ్య వీధి,ఇజ్జాడవారివీధి, బంకపల్లి వారి వీధి, బారిస్టర్ వీధి, నేతాజీ వీధి, శ్రీనివాసరావు వీధి. శాతవాహన కాలేజీ వెనుక ప్రాంతం తదితర ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మధురానగర్‌లో..

మధురానగర్(విజయవాడసెంట్రల్):ముత్యాలంపాడు సెక్షన్ 11 కె.వి లోటస్ ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోటస్ సెక్టార్ -3, లోటస్ మెయిన్ రోడ్డు, కేదారేశ్వరపేట జీరో లైన్, ఒకటో లైన్ నుంచి ఐదో లైను వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

గాయనీ గాయకులు నిరంతరం సాధన చేయాలి



విజయవాడ కల్చరల్: గాయనీ గాయకులు నిరంతరం సాధన చేయాలని సీనియర్ పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు అన్నారు. స్వరార్చన ఆర్కెస్ట్రా తన 10 వార్షికోత్సవం గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద శుక్రవారం నిర్వహించింది. డేవిడ్‌రాజు మాట్లాడుతూ గాయనీ గాయకులు అనుకరణ కన్నా సొంతబాణీ కలిగి ఉండాలన్నారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. స్వరార్చన వ్యవస్థాపకుడు డీజే రాము సంస్థ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన డి.వీరభద్రరావు, శ్యాంప్రసాద్, ప్రసూనా రామన్, కేవీబీ మూర్తి పాల్గొన్నారు. చంద్రశేఖర్, మల్లాది స్వాతి, జ్ఞాన కిషోర్, ఆదిరాల జయప్రభ, కంచి మల్లీశ్వరి పలు తెలుగు చిత్రగీతాలను ఆలపించారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని అయాన్ ఐ హాస్పిటల్ గౌరవ అధ్యక్షుడు వావిలాల రజనీకాంత్‌శర్మ తెలిపారు. కేదారేశ్వరపేటలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాసవి క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఫ్యూచర్‌పాత్ స్కూల్ అవరణలో ఈ ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే శిబిరంలో అయాన్ ఐ హాస్పటల్ నేత్ర వైద్యులు, సిబ్బంది పాల్గొని ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, ఐ డ్రాప్‌లను అందిస్తారన్నారు. పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పండ్ల మార్కెట్ వ్యాపారులు, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలి కోరారు.

ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.4.56 లక్షలు స్వాధీనం

కృష్ణలంక(విజయవాడతూర్పు):కనకదుర్గ వారధి చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం నిర్వహించిన సోదాల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.4లక్షల 56వేలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కృష్ణలంక పోలీసుల కథనం మేరకు... గుంటూరు జిల్లా తాడేపల్లి ప్రాంతానికి చెందిన పి.శివశంకర్ విజయవాడ నగరంలోని ఒక థియేటర్ వద్ద వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో ఒక కారులో గుంటూరు వైపు నుంచి వారధి మీదుగా నగరానికి బయలుదేరాడు. వారధి చెక్ పోస్ట్ వద్ద పోలీసులు ఆ కారును తనిఖీ చేసి అతని వద్ద రూ.3 లక్షల 56 వేలు నగదు ఉన్నట్లు గుర్తించారు.

అలాగే గుంటూరులోని బృందావన్ గార్డెన్‌కు చెందిన రియాల్టర్ కర్నాటి నాగేశ్వరరావు తన కారులో శుక్రవారం సాయంత్రం గుంటూరు నుంచి వారధి మీదుగా నగరానికి బయలుదేరాడు. వారధి చెక్ వద్దకు రాగానే పోలీసులు కారును తనిఖీ చేసి రూ.లక్ష ఉన్నట్లు గుర్తించారు. వారిద్దరూ ఆ నగదుకు ఎలాంటి బిల్లులు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సర్వ మానవాళి రక్షకుడు ఏసుక్రీస్తు



గుడ్‌ఫ్రైడే ప్రార్థనలో ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు



సింగ్‌నగర్‌లో జరిగిన సిలువ ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యేలు

పాయకాపురం(విజయవాడరూరల్):మానవాళిలో ప్రేమతత్వాన్ని నింపేందుకు, సమాజంలో శాంతిని నెలకొల్పేందుకు క్రీస్తు తన ప్రాణాన్ని త్యాగం చేశారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. కండ్రికలో బైబిల్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గుడ్‌ఫ్రైడే వేడుకల్లో సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి సామరస్యాలకు మార్గాలు చూపుతాయన్నారు. పరుల కోసం జీవించే వారు చరితార్థులు అవుతారనడానికి ఏసుక్రీస్తు జననం ఒక నిదర్శనమని పేర్కొన్నారు. కరుణామయుడైన ఏసుక్రీస్తు సిలువ వేసిన రోజు గుడ్‌ఫ్రైడే అయితే , ఆ తరువాత ఆయన పునరుజ్జీవించిన ఆదివారం రోజు ఈస్టర్ అని గుర్తు చేశారు. ఈ రెండూ మానవాళి చరిత్రను మలుపులు తిప్పిన ఘట్టాలని కొనియాడారు. వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవాళి కోసం జీసస్ చేసిన త్యాగానికి గుర్తు గుడ్‌ఫ్రైడే అని కొనియాడారు. ఇతరులపై ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, సహనం, త్యాగం ఇవన్నీ తన జీవితం ద్వారా ఆయన మానవాళికి ఇచ్చిన సందేశాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, ఎస్‌కే ఇస్మాయిల్, మేడా రమేష్, అవుతు శ్రీనివాసరెడ్డి, కొక్కిలిగడ్డ నాని, మీసాల రామకృష్ణ, మాతా మహేష్, బత్తుల శేఖర్, డాక్టర్ మేళం చిన్నా, పిల్లి కృష్ణవేణి, యక్కల మారుతి, పాస్టర్ సత్తా దాసు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డివిజన్‌లోని పలు ప్రార్థన మందిరాల్లో జరిగిన గుడ్‌ఫ్రైడే వేడుకల్లో వెలంపల్లి పాల్గొన్నారు.



గుడ్‌ఫ్రైడే పురస్కరించుకుని విశ్వాసకులకు బహుమతులు అందజేస్తున్న డానియేల్

పాపముల నుంచి విముక్తుల్ని చేసేందుకు...

మధురానగర్(విజయవాడసెంట్రల్):సర్వ మానవాళిని పాపముల నుంచి విముక్తులను చేసేందుకు సర్వోన్నతుడైన ఏసుక్రీస్తు శిలువపై మరణించారని పాస్టర్లు గంజి ధర్మరాజు, విలియం బూత్ అన్నారు. 32వ డివిజన్ శాంతినగర్లోని క్రైస్తవ విశ్వాసుల ప్రార్థన మందిరంలో గుడ్ ఫ్రైడే వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాస్టర్లు గంజి ధర్మరాజు, విలియం బూత్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలను వివరించారు. సంఘ పెద్దలు యాకోబు, పవిత్ర, అనిల్, సువర్ణరాజు, జోసఫ్, మేరిమ్మ తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ కాలనీ సీయోను ప్రార్థన మందిరంలో రెవరెండ్ డాక్టర్ కనమాల వరప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రామకృష్ణాపురం ఫుల్‌గాస్పెల్ మినిస్ట్రీస్ చర్చిలో రెవరెండ్ డాక్టర్ డానియేల్ ఏసుక్రీస్తు సందేశం వివరించారు. మధురానగర్ కొబ్బరితోటలో జీసస్ ప్రేయర్ ఫెలోషిప్ చర్చిలో రెవరెండ్ డాక్టర్ బందెల దయానందం ఏసుక్రీస్తు సందేశం వివరించారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఏసుక్రీస్తు ప్రభువుకు సిలువ వేసిన రోజుకు గుర్తుగా జరుపుకునే గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు సింగ్‌నగర్, వాంబేకాలనీ, న్యూరాజరాజేశ్వరీపేట పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఘనంగా జరిగాయి. సింగ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీలో గల ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో యేసుప్రభువు సిలువ మోసే ఘటనలు గుర్తుచేస్తూ క్రైస్తవ విశ్వాసులు సిలువను మోస్తూ భారీ ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటల వరకూ క్రైస్తవ విశ్వాసులు ఉపవాస దీక్షలు చేపట్టారు. ఈ ప్రాంతాల్లో జరిగిన పలు ప్రార్థనల్లో ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో పెరిగిన రద్దీ



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు

భక్తులతో కిటకిటలాడిన క్యూలైన్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను శుక్రవారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణంతో పాటు హోమాల్లో ఉభయదాతలు పాల్గొన్నారు. దుర్గగుడి ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వదర్శనంతో పాటు రూ. 100, రూ.300, రూ.500 టికెట్ క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో టికెట్ ఉన్న వారికి మాత్రమే అంతరాలయ దర్శనం కల్పించారు. సిఫార్సులు, వీఐపీల పేరిట వచ్చే వారికి సైతం రూ. 500 టికెటు ఉంటేనే క్యూలైన్‌లోకి అనుమతించారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన రద్దీ మధ్యాహ్నం 2-30 గంటల వరకు కొనసాగింది. అమ్మవారికి మహా నివేదన నిమిత్తం అర్ధగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో రద్దీ మరింత పెరిగింది. క్యూలైన్‌లో ఉన్న భక్తులకు అమ్మవారి దర్శనం త్వరత్వరగా అయ్యేలా ఆలయ అధికారులు, సిబ్బంది రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకున్నారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతులు, దర్బార్ సేవలను నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారి ఉత్సవ మూర్తికి విశేష అలంకరణ



లక్ష కుంకుమార్చనలో ఉభయదాతలు

నేటి నుంచి రూరల్‌లో వంశీ ఎన్నికల ప్రచారం

రామవరప్పాడు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ విజయవాడరూరల్ మండలంలో శనివారం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారని గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులో ఉదయం ఏడు గంటలకు ఎన్నికల ప్రచారాన్ని వంశీ ప్రారంభించనున్నారని వెల్లడించారు. శనివారం నుంచి ఏప్రిల్ నాలుగు వరకు ఎనికేపాడు, ప్రసాదంపాడు, రామవరప్పాడు కాల్వగట్టు ప్రాంతాల్లో ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు. ఏప్రిల్ 5న నున్న, 6న పాతపాడు, 7న అంబాపురం, పి.నైనవరం, 8న నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో వంశీ పర్యటిస్తారని వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని వివరిస్తూ ఎన్నికల ప్రచారంలో ముందుకు సాగుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, సొసైటీ చైర్మన్లు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

సమైక్యతకు నిలయంగా ఇఫ్తార్ విందు

లబ్బీపేట(విజయవాడతూర్పు):రంజాన్ మాసంలో సమైక్యతకు నిలయంగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తుంటారని జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ రఫీఖ్ అన్నారు. ఆ సంస్థ తూర్పుశాఖ ఆధ్వర్యంలో లబ్బీపేటలో శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎండీ రఫీఖ్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలోనే విశ్వమానవాళికి మార్గదర్శకత్వం కోసం దివ్య ఖురాన్ అవతరించినట్లు తెలిపారు. ఈ భౌతిక జీవితంలో ఆరాధనలు, ఆధ్యాత్మికత ద్వారా మాత్రమే శాంతి సుఖాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ కరీముద్దీన్, ఇస్మాయిల్ ఉమ్రీ, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు రఫీఖ్

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

పెనమలూరు: చోడవరం గ్రామ పరిధి కృష్ణానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రెవెన్యూ, పోలీసు అధికారులు సీజ్ చేశారు. రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాలు.. చోడవరం ఇసుక క్వారీ నుంచి ఇసుక మాఫియా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని అందిన సమాచారంతో గురువారం రాత్రి ఆర్ఐ భరద్వాజ్, ఎస్ఈబీ, పెనమలూరు పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో నదిలో ఇసుక లోడ్ చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు పారిపోయారు. ట్రాక్టర్లను పెనమలూరు తహసీల్దార్ కార్యాలయం వద్దకు తీసుకువచ్చి సీజ్ చేశారు. ట్రాక్టర్ నంబర్ల ఆధారంగా వాటి యజమానులు కొడాలి విష్ణువర్ధనరావు, అన్నే వెంకటేశ్వరరావులుగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

అత్తింటివారిపై వరకట్నం వేధింపు కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం చోడవరం వాటర్ ట్యాంకు ప్రాంతానికి చెందిన చోరగుడి ప్రశాంతి 2015వ సంవత్సరంలో చినపారుపూడికి చెందిన దానియేలును పెద్దల సమక్షంలో కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. భర్త వంట మేస్త్రీగా పని చేస్తాడు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. కాగా భర్త దురలవాట్లకు బానిసగా మారి అదనపు కట్నం తీసుకు రమ్మని భార్యను వేధించసాగాడు. భర్తతో పాటు అత్త బాయమ్మ, ఆడపడుచు చదువుల వజ్రం, ఆమె భర్త కోటయ్య, పెద్ద ఆడపడుచు కుమారుడు కె.అవినాష్‌లు వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా అత్తింటి వారిపై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పెనమలూరు: కానూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయలు అవ్వడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కంకిపాడు మండలం పునాదిపాడుకు చెందిన ఎస్.వీరవెంకటశ్రీనివాసరావు తన బైక్‌పై విజయవాడకు వెళ్లాడు. విజయవాడలో పని ముగించుకుని తిరిగి బైక్‌పై వస్తూ కానూరు పంటకాలువ రోడ్డు జంక్షన్ వద్దకు రాగా వెనుక నుంచి వచ్చిన లారీ అతడిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతని కాలుకు తీవ్ర గాయమవ్వడంతో స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉన్నత చదువులకు దేవినేని ట్రస్టు సహకారం

ఆటోనగర్(విజయవాడతూర్పు):రామలింగేశ్వరనగర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన షేక్ ముబీనా ఉన్నత చదువులకు దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ అన్ని విధాలుగా అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ భరసా ఇచ్చారు. ముబీనా 10 వతరగతి, ఇంటర్‌లో మంచి ర్యాంకుతో ప్రతిభ కనపరిచింది. సిద్ధార్థ మహిళా కళాశాలలో హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతుంది. శుక్రవారం రామలింగేశ్వరనగర్ గాంధీనగర్ కాలనీలో దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, మాజీ డెప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావులు విద్యార్థి ముబీనాను శాలువతో సన్మానించారు. ఈ విద్యార్థి చదువుకునేందుకు గాను దేవినేని చారిటబుల్ ట్రస్ట్ అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని చెప్పారు. నిరుపేద విద్యార్థులను ఆదుకుంటామని తెలిపారు.

వైభవంగా వీరభద్రస్వామి కల్యాణం

బొబ్బర్లంక(మోపిదేవి): మండలంలోని బొబ్బర్లంక గ్రామంలో శ్రీ దుర్గా సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయంలో వేంచేసియున్న శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వార్ల కల్యాణం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. సాయంత్రం 4 గంటలకు స్వామివార్ల గ్రామోత్సవం వైభవంగా జరిపారు.

కోడి పందేల శిబిరంపై దాడి

నాలుగు కోళ్లు, రూ.15 వేల నగదు స్వాధీనం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని పెదకళ్లేపల్లిలో కోడి పందేల శిబిరంపై గురువారం సాయంత్రం దాడి చేశామని ఎస్ఐ వైవీీ సత్యనారాయణ శుక్రవారంతెలిపారు. పోలీసులు కోడిపందాలు నిర్వహిస్తున్న వారిపై ఆకస్మిక దాడిచేసి 23 మందిని పట్టుకున్నట్లు వివరించారు. రెండు వేర్వేరు శిబిరాలపై దాడులు చేశామన్నారు. ఒక శిబిరంలో పది మంది నుంచి రూ.9,500 నగదు రెండు కోళ్లు, రెండు కత్తులు మరో శిబిరంలో 13 మంది నుంచి రూ.5,500 నగదు, రెండు కోళ్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ వివరించారు.

ముస్లిం మైనార్టీలకు జగనన్న అండ

మధురానగర్(విజయవాడసెంట్రల్):ముస్లిం మైనార్టీల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. మధురానగర్ మస్జిద్ ఏ సిద్ధిఖీ మసీదులో శుక్రవారం జరిగిన నమాజ్‌లో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేసి ఉపవాస దీక్షను విరమింప చేశారు. వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్‌లు కల్పించి సముచిత స్థానం కల్పించగా ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అదేబాటలో నడుస్తూ ముస్లింలకు అన్ని రంగాలలో పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి అల్లా ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ముస్లింలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల పక్షపాతి అన్నారు. ఆయన ఎల్లప్పుడూ ముస్లింల సంక్షేమానికి కృషి చేశారని తెలిపారు. ముస్లిం మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి వెలంపల్లి శ్రీనివాసరావును ఆశీర్వదించారు. అనంతరం ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, బాబు, మసీదు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో వెలంపల్లి శ్రీనివాసరావు

ప్రభుత్వానికి అండగా నిలవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్):మంచి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ 31వ డివిజన్ ఇన్‌చార్జి పెనుమత్స సత్యం కోరారు. పసుపుతోటలో శుక్రవారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి కేశినేని నానికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తాము చేసిన మంచిని చూసి నచ్చితేనే ఓటు వేయాలని కోరారు. కుల మతాలు రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా చిట్టచివరి గడప వరకు సంక్షేమ పథకాలను అందించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జగనన్నకు ఓటు వేసి గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయటంతో పాటు ఇవ్వని హామీలను సైతం నెరవేర్చిన ధీశాలి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తామంతా వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి గెలిపిస్తామని ప్రజలు అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటరెడ్డి, కె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పథకాల గురించి వివరిస్తున్న సత్యం

కష్టపడి పనిచేస్తే పార్టీలో గుర్తింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్):వైఎస్సార్ సీపీ నగర సాంస్కృతిక విభాగం అధ్యక్ష, కార్యదర్శులుగా నియమితులయిన పి.వెంకన్న, ప్రభల శ్రీనివాసరావు శుక్రవారం ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ పి.గౌతంరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని తెలిపారు. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. తమపై నమ్మకంతో అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. గౌతంరెడ్డిని శాలువాతో సత్కరించారు.



డాక్టర్ పూనూరు గౌతంరెడ్డిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలుపుతున్న దృశ్యం

దుర్గమ్మ భక్తులకు మజ్జిగ పంపిణీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ దర్శనానికి విచ్చేసే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని శుక్రవారం ఈవో రామారావు ప్రారంభించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం ఎదుట దేవస్థాన ఆధ్వర్యంలో ప్రతి రోజు ఉదయం భక్తులకు మజ్జిగ పంపిణీ జరుగుతుంది. తొలి రోజైన శుక్రవారం ఆలయ ఈవో రామరావు కుటుంబం పేరిట 5 క్యాన్‌ల మజ్జిగను భక్తులకు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఈవో రామరావు మాట్లాడుతూ ప్రతి ఏటా ఉగాది పర్వదినం నుంచి ఆలయ ప్రాంగణంలో మజ్జిగ వితరణ చేస్తామని, అయితే ఈ ఏడాది ముందుగానే ఎండల తీవ్రత అధికం కావడంతో మజ్జిగ పంపిణీ ప్రారంభించామని చెప్పారు. అమ్మవారి దర్శనం పూర్తి చేసుకుని బయటకు వచ్చే వారికి మజ్జిగను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ రమాదేవి, ఏఈ కుటుంబరావు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



భక్తులకు మజ్జిగను పంపిణీ చేస్తున్న ఈవో రామరావు, ఈఈ రమాదేవి

బోనమెత్తిన భక్తజనం



అమ్మవారికి బోనాలు తెస్తున్న భక్తులు

పెనుగంచిప్రోలు:శ్రీతిరుపతమ్మ అమ్మవారి చిన్నతిరునాళ్ల మహోత్సవం శుక్రవారం భక్తుల బోనాలతో ఘనంగా ముగిసింది. భక్తులు స్థానిక మునేరులో స్నానాలు చేసి పాలు, పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. తొలిబోనం ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు అమ్మవారికి సమర్పించారు. భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలతోపాటు క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. ఉత్సవాల్లో ఐదు రోజులపాటు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నందిగామ ఏసీపీ రవికిరణ్ ఆధ్వర్యంలో సీఐ జానకిరామ్ పర్యవేక్షణలో ఎస్ఐ పి రాంబాబు బందోబస్తు నిర్వహించారు. తిరునాళ్లలో తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో దేవస్థాన అధికారులు, గ్రామంలో సర్పంచి వేల్పుల పద్మకుమారి పర్యవేక్షణలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టి భక్తులకు ఇబ్బంది లేకుండా చూశారు.



క్యూలైన్‌లో కిక్కిరిసిన భక్తులు